రక్షించండి బాబూ అని ఎవరైనా వస్తే అప్పుడు లేస్తాడు నిద్ర. ఎలాంటి బల ప్రయోగం, ఘర్షణ, రక్తపాతం లేకుండా కేవలం తన ఆలోచనలతోనే అన్యాయం చేసినవాడి పీకకు ఉచ్చు బిగిస్తాడు.

ఎప్పుడూ, ఎక్కడా ఇంతవరకు అతని పథకం దెబ్బతినలేదు. దారితప్పలేదు.

అతనే రాజర్షి.

చుట్టుపక్కల వాళ్ళకు అన్యాయం జరిగితే పోలీస్‌స్టేషన్ కు వెళ్ళరు. కోర్టుకి అంతకంటే వెళ్ళరు. సరాసరి రాజర్షి ఆశ్రమానికే వస్తారు.

అలా అని అతనే సన్యాసిలా వుండడు. కాషాయ బట్టలు ధరించడు.

ఖద్దరు లాల్చీ, ఖద్దరు పైజమా, మెడలో మెలితిరిగి కనిపించే మఫ్లర్, కాళ్ళకు కాన్పూర్ చెప్పులు.

ఒక్క ఉదుటున రాజర్షిని చూస్తే... అతనే ఎస్.పీల్ని,ఐజీల్ని, ఐ.ఎ.ఎస్ లాంటి బ్యూరోక్రాట్స్‌ని సయితం అన్యాయం చేస్తారని తెలిస్తే హడలెత్తించగల అనితరసాధ్యుడని ఎవరూ ఊహించలేదు.

అతని తోడు ఇద్దరు అనుచరులు, ఇద్దరు వంటవాళ్ళు, ఇద్దరు తోటమాలీలు మాత్రమే ఉంటారు.

నిర్మానుష్యంగా వుండే నిశీధి ప్రాంతంలో నిశ్శబ్దమే వారికి తోడు. రోజంతటిలో ఆ ఆశ్రమంలో ఒకటి, రెండు మాటలు మాత్రమే వినిపిస్తాయి.

ఎవరికివారే రాజర్షి కళ్ళల్లో కదలాడే అతని మనోభావాన్ని పసిగట్టి అందుకు తగ్గట్టుగా వ్యవహరించుకుపోతుంటారు.

అన్యాయం చేసినవాడు ఎంతటి గొప్పవాడయినా, మరెంతటి ప్రమాదకరమైన వ్యక్తి అయినా రాజర్షికి తెలిసినరోజు నుండి అతని ప్రతి కదలిక ఆటోమేటిగ్గా ఆశ్రమంలో రికార్డయిపోతుంటుంది.

ఉన్నట్టుండి అతను ఓ రోజు తన అనుచరుల్ని ఇద్దర్ని పిలిచి అప్పటికే తన మేధలో రూపుదిద్దుకున్న పథకం గురించి వివరిస్తాడు.

ఆ మరు క్షణం ....

ఆ ఇద్దరూ రంగంలోకి దిగటం... పథకాన్ని యధాతథంగా అమలు పర్చటం....

అన్యాయం జరిగినవాడికి ఆనందం కలిగించటం వారికి సర్వసాధారణమైన విషయము.

రాజర్షిని మొట్టమొదటిసారిగా ప్రపంచానికి తెలియజేసిన సంఘటన సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం జరిగింది.

ఆ ఏరియాకి కొత్తగా గౌసుద్దీన్ అనే ఐ.పి.యస్. ఆఫీసర్ ఎ.ఎస్.పి.గా వచ్చాడు. ఆయన వచ్చిన రెండోరోజు ఒకసంఘటన జరిగింది.

ఒక వీధి రౌడీని అర్ధరాత్రి లేపి చితకబాదుకుంటూ తీసుకెళ్ళారు. ఆ సమయంలోఆ ఇంటిలో ఎవరూ లేరు. అతను ఏ నేరం చేశాడో కూడా పోలీసులు చెప్పలేదు. అసలెందుకు అరెస్ట్ చేశారో కూడా చెప్పలేదు. అతని భార్య ఇంటికి వచ్చిన తర్వాత విషయం తెలిసింది. వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్ళింది.కారణం ఏమిటని అడిగిన అతని భార్యను ఆడదని కూడా చూడకుండా నానా దుర్భాషలాడి పంపించేశారు. మరుసటిరోజు ఓ పి.సి ద్వారా తెలిసిందేమిటంటే ఆ రౌడీ దొంగనోట్ల మార్పిడి చేశాడని.

అది విని అతని భార్య అవాక్కయిపోయింది.

ఎవరి సలహా మీదనో రాజర్షి ఆశ్రమానికి వెళ్ళి పని కోసం అర్థించింది. రోజు కూలిమీద తోటపనికి కుదిరింది కూడా.

ఓ రోజు ఆమె ఆరోజు కూలి తీసుకుని వెళ్తుండగా బయటి నుంచి వస్తున్న అతని కళ్ళలో పడింది.

ఆమె కళ్లు అప్పటికే ఏడ్చి ఏడ్చి ఉబ్బిపోయినట్లుగా ఉన్నాయి అతని దట్టమైన కనుబొమ్మలు  ఆశ్చర్యంతో పైకి లేచాయి.

మరో అరగంటకల్లా ఆమె పరిస్థితి అంతా అతనికి తెలిసిపోయింది. ఆమె చెబుతున్న మాటల్ని బట్టి ఆమె భర్త నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతునట్లు, ఇంటిపట్టునే ఉంటున్నట్లు తెలిసింది.

ఆమె కళ్లలో కనిపిస్తున్న వేదన వెనుక దాగిన నిజాయితీని రాజర్షి కళ్ళు పసిగట్టాయ్. ఆమె తనంతట తానే తన మొగుడు వీధిరౌడీ అని, చిన్న చిన్న దొంగతనాలు చేస్తుంటాడని ఒప్పుకుంది.

రాజర్షికి ఆమె మాటలపై నమ్మకం కుదిరింది. వెంటనే తన అనుచరుల్ని రంగంలోకి దింపాడు.

వెళ్ళిన గంటకే అనుచరులు మొఖాలు వేలాడేసుకొని వచ్చారు. అతను పాతకేడీ అని, అతనే దొంగనోట్ల వ్యాపారం చేస్తుంటాడని, అందుకే అరెస్ట్ చేశామని, సాక్ష్యాల కోసం అన్వేషిస్తున్నామని, అతన్ని చచ్చినా వదిలిపెట్టమని... పైగా అదసలే కేంద్ర హోంమంత్రి నియోజక వర్గమని, మరోసారి అతన్ని విడిపించాలంటూ  వస్తే తమని కూడా అరెస్టు చేస్తామని తన అనుచరులను గౌసుద్దీన్ బెదిరించినట్లు తెల్సుకున్నాడు రాజర్షి.

అంతావిని అప్పుడతనేం మాట్లాడలేదు.

మరుసటి రోజు సరిగ్గా ఒంటి గంటకు రాజర్షి ఓ బ్రీఫ్‌కేసుతో గౌసుద్దీన్ ఛాంబర్‌లోకి ఎంటర్ అయ్యాడు.

తమ గురువు చేతిలోవున్న బ్రీఫ్‌కేసులో ఏముందో ఎ.ఎస్‌పి.ని ఎలా డీల్ చేయబోతున్నాడో అర్థంకాక అనుచరులంతా ఆఫీస్ బయటే నించుని  ఎదురుచూస్తున్నారు.

పది నిమిషాలు గడిచాయి.

అంతలో ఆఫీస్ ముందో జీపు ఆగింది.

అందులోంచి అయిదారుగురు వ్యక్తులు హడావుడిగా గౌసుద్దీన్ చాంబర్‌లోకి దూసుకెళ్ళారు.

ఆది జరిగిన మరో పదినిమషాలకు రాజర్షి చిరుదరహాసంతో బయటకొచ్చాడు.

అనుచరులు భయపడుతూనే అడిగారు ఏం జరిగిందంటూ.

"హల్లో మిస్టర్ ఎ.ఎస్.పి...నా పేరు రాజర్షి.... అరగంట క్రితమే నాకు హోటల్ మేరిస్ వెనుకవేపు గోడదగ్గర ఈ బ్రీఫ్‌కేస్ దొరికింది. దాన్ని చేతుల్లోకి తీసుకుని దాని యజమానికోసం పావుగంట సేపు వెతికాను. అయినా ప్రయోజనం కనిపించలేదు. పోయిన వస్తువే తమది కాక పోయినా తమదనే ఈ స్వార్ధ ప్రపంచంలో దీన్ని తమదంటూ ఎవరూ ముందుకు రాకపోవటంతో నాకనుమానంవేసి ఎవడన్నా ప్రాక్టికల్ జోక్ ప్లే చేశాడా అని దీన్ని ఓపెన్ చేశాను" అంటూ రాజర్షి తన చేతిలోని బ్రీఫ్‌కేస్ తీసి గౌసుద్దీన్ టేబుల్ పై ఉంచాడు.

"దీన్నిండా కరెన్సీ నోట్లకట్టలున్నాయి" రాజర్షి కావాలనే పై వాక్యాన్ని స్లో మాడ్యులేషన్ తో అన్నాడు.

గౌసుద్దీన్ విస్మయంగా ముందుకు వంగాడు.

"కాని ఆ నోట్లన్నీ దొంగనోట్లే... ఫేక్ నోట్స్" అన్నాడు రాజర్షి నెమ్మదిగా.

గౌసుద్దీన్ ఆశ్చర్యంతో కుర్చీలో నిటారుగా అయిపోయి "వెరీ గుడ్..వెరీగుడ్... సిటిజన్ అంటే అలా వుండాలి" అన్నాడు రాజర్షి వేపు ప్రశంసగా చూస్తూ.

"ఈనోట్లని మీ కస్టడీలో దాయండి ఎందుకంటే మీ ఆఫీస్‌లో పి.సి.లెవరన్నా కక్కుర్తిపడి అవి మంచినోట్లు అని కొన్నిటిని వాడుకుంటే ప్రమాదం. బాధ్యతాయుతమైన పౌరుడిగా కేసు చివరవరకు నేను గట్టి సాక్ష్యం ఇస్తాను...".

గౌసుద్దిన్ బ్రీఫ్ తెరచి చూశాడు, నిండా పచ్చనోట్లు. అతని ముఖంలో వృత్తిపరమైన ఉద్విగ్నత.

రాజర్షి తిరిగి తొందర చేశాడు వాటిని పర్సనల్ బీరువాలో భద్రపర్చండంటూ.

గౌసుద్దీన్‌కి తెలియదు తనో పేద్ద ఉచ్చులో ఇరుక్కోబోతున్నట్లు.

వెంటనే బ్రీఫ్‌ని తీసుకెళ్ళి తన పర్సనల్ బీరువాలో భద్రపర్చి వెనుదిరిగాడు.

అంతే ఎదురుగా ఏంటి కరప్షన్ డిపార్ట్‌మెంట్ అధికారులు. విజిటింగ్ కార్డ్స తీసి బయటకు చూపిస్తూ ముందుకొచ్చారు.

"మాకిప్పుడు ఇన్‌ఫర్మేషన్ వచ్చింది. మీరు పాతికవేలు లంచం రాజర్షి అనే వ్యక్తి నుంచి తీసుకోబోతున్నట్లు..."

గౌసుద్దీన్ మొఖం కందగడ్డలా అయింది "వాట్ నాన్‌సెన్స్ యువార్ చార్జింగ్-మైండ్ యువరోన్ బిజినెస్" అన్నాడు గౌసుద్దీన్ కోపంగా.

వచ్చిన అధికారుల్లో ఒకరికి గౌసుద్దీన్ తిరస్కారంకి మంటెక్కింది.

"అలాగే... మా బిజినేస్ మేం చూసుకుంటాం, మీరిప్పుడు బీరువాలో ఏం దాచి వస్తున్నారు"

"హోల్డ్ యువర్ థంగ్ ఆఫీసర్, ఫేక్‌నోట్స్ అతనికి దొరికితే నాకు తెచ్చిచ్చాడు".

రాజర్షి పెదాలపై సన్నని చిరునవ్వు వెలిసి అదృశ్యమయింది.

"ఓకే..ఓకే.. ఏవీ ఓ సారి పరీక్షిస్తాం" ఓ అధికారి చిరునవ్వుతో అన్నాడు.

గౌసుద్దీన్‌కి అరికాలిమట నెత్తికెక్కింది.

"నేను చూపించను, ఫేక్ నోట్స్‌కేస్ మీదికాదు, కనుక విల్ యూ ప్లీజ్ గెటవుట్!" అతను కోపంగా చూస్తూ గద్దించాడు.

దాంతో వచ్చిన అధికారులందరికీ కోపం వచ్చింది "ఫేక్ నోట్స్ అయితే మీ కేసు ఒరిజినల్ నోట్స్ అయితే మా కేసు. క్రైం ప్లీ షో దట్ బ్రీఫ్ - బియింగ్ ఏ రెస్పాన్సిబుల్ పోలీసాఫీసర్".

ఓ అధికారి సౌమ్యంగానే అన్నా అందులోవున్న కరుకుదనం గౌసుద్దీన్ దృష్టిని దాటిపోలేదు.

విసురుగా వెళ్ళి బ్రీఫ్ తెచ్చి టేబుల్ మీదకు గిరాటేశాడు.

రాజర్షి లేచి గౌసుద్దీన్ పక్కకు వచ్చాడు కావాలనే....

ఓ అధికారి బ్రీఫ్ ఓపెన్ చేస్తే, మరో అధికారి ఒక నోటును బయటకు తీసి చెక్ చేశాడు.

వెంటనే మరో నోట్.... ఆ వెంటనే మరో నోట్ చకచకా రెండు నిముషాల్లోనే ఐదారు నోట్ను చెక్ చేసి తలెత్తాడు. అతని కళ్ళలో దొంగను చూస్తున్న భావం కనిపించింది.

అప్పుడన్నాడా అధికారి "పోలీసులు ఎక్కడ దొంగతనం జరిగినా పాత కేడీల్నే ఎందుకు అరెస్టు చేస్తారో అప్పుడర్థమైంది. అలాగే మేమూ చేయాలి ఇకనుంచి" అన్నాడు వ్యంగ్యంగా.

ఇంకా అర్థం కాక అయోమయంగా, కోపంగా చూస్తున్న అతని చెవిలో చిన్నగా అన్నాడు రాజర్షి "దటీజ్ రాజర్షి " అని!

గౌసుద్దీన్ ఉలిక్కిపడ్డాడో క్షణం.

"ఇవి ఫేక్ నోట్స్ అని డైలాగ్స్ చెప్పావు. పైగా నిజాయితీ గల ఆఫీసర్‌లా పోజులొకటి"అధికారి మాటలు పూర్తి కాలేదు.

గౌసుద్దీన్ పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడ్డాడు.

రాజర్షి చెప్పింది విని అతని అనుచరులు షాక్ తిన్నారో క్షణం.

"పాతిక వేలు ఖర్చయినా పని జరిగింది" అంటూ ముందుకు సాగి పోయాడు మామూలుగా.

"దెబ్బతిన్న ఎస్.పి. అంత తేలిగ్గా మనల్ని వదిలేస్తాడా?" జంకుతూనే అడిగారు సహచరులు.

“ఊరుకోడు. ఇల్లు పీకి పందిరి వేస్తాడు...” వేగంగా నడుస్తూ అన్నాడతను.

“అందుకు మనం అడ్డుకోవాలి కదా?” రాజర్షి ఆజ్ఞ కోసం ఎదురుచూస్తూ అడిగారు సహచరులు.

“అడ్డుకోవటం మాములు చర్య, చెప్పానుగా.... ఘర్షణ లేకుండానే వాడి వేలితో వాడే వాడికన్ను పొడుచుకునేలా చేయాలి”.

అనుచరుల కర్థంకాలేదు అతను చెప్పింది. వెంటనే ఏం చేయాల్సింది అతను చెప్పుకుపోతున్నాడు.

అర్ధరాత్రి ఒక్కసారి ఆశ్రమం చుట్టుపక్కల పర్చుకున్న నిశ్శబ్దం బ్రద్దలయింది. గౌసుద్దీన్ ఇద్దరు ఎస్.ఐ లు పదిమంది పి.సి.లతో వచ్చి అశ్రమానికి ముందున్న పొందికయిన పూలతోటను నామారూపాల్లేకుండా చేసేశారు.

లోపలనుంచి అనుచరులు అది చూసి ఆవేశంతో ఊగి పోయారేతప్ప రాజర్షి ఆజ్ఞను మీరలేదు.

రాజర్షి ఆ టైమ్‌లో నిశ్చింతగా నిద్రపోతున్నాడు.

మరుసటిరోజు ఉదయం ఏడుగంటలసమయం....

గౌసుద్దీన్ ఇంట్లో ఫోన్ మోగింది.

“మిస్టర్ గౌసుద్దీన్ ఇది రాజర్షి ఫోన్ కాల్” అన్నాడు రాజర్షి కిటికీలోంచి నాశనమయిపోయిన తోటను చూస్తూ.

“నువ్వా....నీకు నేనేం అన్యాయం చేశాను. నన్ను అనవసరంగా కేసులో ఇరికించావు?” గౌసుద్దీన్ కోపంగా అన్నాడు.

“చిల్లర దొంగతనాలు చేసుకుని పొట్ట పోసుకునే ఓ కేడిని పట్టుకొచ్చి దొంగనోట్లు వ్యాపారం చేసాడని ఇరికించావ్. దొంగనోట్లు మార్చేవాడు వీధి రౌడీలా ఉండడు. వీధికి పెద్దలా వుంటాడు. వుండాలి. లేదంటే నోట్లు మార్చుకోలేడు. ఇక్కడ నీకు కామన్‌సెన్స్ లోపించింది. పోతే వాడు నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతూ మంచానికి అతుక్కుపోయి వున్నాడు. అందుకు వాడి శవాకారమే సాక్ష్యం. ఇకపోతే అసలు దొంగ ఏ రాజకీయ నాయకుడో వ్యాపారవేత్తో అయుంటాడు. వాడ్ని పట్టుకోవటం చాతకాకో, చేతయినా ధైర్యం లేకో ఓ పిచ్చి వెధవని బొక్కలోకి తోశావ్. వాడు దొంగతనాలు చేయటం మంచా చెడా అన్న మీమాంస అటుంచితే-వాడి చేతులాడందే వాడి పెళ్ళాం బిడ్డలకు తిండి వుండదు.”

రాజర్షి చెప్పేది పూర్తి కాకుండానే గౌసుద్దీన్ “అయితే ఏంటి...? దానికి నన్ను ఇరికించటానికి సంబంధమేంటి?” అడిగాడు ఉక్రోషంగా.

“ఉంది, సంబంధం చాలావుంది. ఎక్కడ అన్యాయం జరిగినా నేను సహించను. నీ మూలంగా వాడికి ఐదారేళ్ళ జైలుశిక్ష పడవచ్చు. దానిమూలంగా వాడి పెళ్ళాం బిడ్డలు అనాథలైపోతారు. ఇకపోతే సంబంధం అన్నావే చెబుతాను.